ఆత్మీయ స్వాగతం







రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుమారుడు వివాహ వేడుకకు బుధవారం మలికిపురం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎంపీ చింతా అనురాధ, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

క్లుప్తంగా

విఘ్నేశ్వరునికి అష్ట ద్రవ్యాభిషేకాలు



విఘ్నేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారు లంకలో వెలిసిన భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయం వద్ద పవిత్ర సంకట చతుర్థి సందర్భంగా విఘ్నేశ్వరునికి అష్ట ద్రవ్యాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన చలం



ఎస్‌వీ చలం

కాట్రేనికోన: కాట్రేనికోన నూతన ఎంపీడీఓగా ఎస్‌వీ చలం బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ గతంలో ఎంపీడీఓగా పని చేసిన సీహెచ్ అప్పారావు పదోన్నతిపై నరసాపురం బదిలీ కావడంతో అప్పటినుంచి ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఈఓపీఆర్డీ కామేశ్వరరావు కొనసాగుతున్నారు. కొత్తగా ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌వీ చలంకు మండల పరిషత్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

సర్పంచుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేష్



రంబాల రమేష్

కాట్రేనికోన: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గంటి వెంకట సుధాకర్, సర్పంచులు చెల్లి సురేష్, గోకరకొండ వీరవెంకట గౌరీ సుబ్బలక్ష్మి, దంతులూరి సీతారామకృష్ణంరాజు తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ ఆదినారాయణ మూర్తి తదితరులు

తాళ్లరేవు: జార్జిపేట గ్రామ పంచాయతీ సచివాలయం-2 శ్రీరామ్ కాలనీకి చెందిన పి.నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావు కుటుంబీకులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను స్థానిక సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి, నాయకులు దడాల జగదీశ్వరరావు, మందపల్లి రాంబాబు తదితరులు బుధవారం అందజేశారు.

గ్యాస్ సిలెండర్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

ముమ్మిడివరం: వంట గ్యాస్ సిలెండర్ వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించొచ్చని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత శ్రీకాంత్ సూచించారు. మండలంలోని అయినాపురంలో బుధవారం ప్రపంచ ఎల్‌పీజీ దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోలు, అదనపు సిలెండర్ ఉంచరాదన్నారు. గ్యాస్ వినియోగం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ బంద్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో పిల్లలను చేర్పించండి



చిన్నారులను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కాట్రేనికోన: వసతి గృహాల్లో చదువుకునే చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న వసతి సౌకర్యాలపై బుధవారం పల్లం, బలుసుతిప్ప గ్రామాల్లో అవగాహన కల్పించారు. ముమ్మిడివరం బీసీ సంక్షేమ శాఖ వసతి గృహ సిబ్బంది బలుసుతిప్ప, పల్లం గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. తల్లిదండ్రులు చేపల వేట కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినపుడు చదువుపై ఆసక్తి ఉన్న చిన్నారుల చదువుకి ఆటంకం కలుగుతుందన్నారు. పిల్లలను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పిస్తే ఆ ఇబ్బంది ఉండదని వివరించారు.

నడినెత్తిన నిప్పుల కొలిమి

- భానుడి ఉగ్రరూపానికి ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- ఉదయం 10 గంటలు దాటితే నిర్మానుష్యంగా రహదారులు
- నైరుతి రుతుపవనాల రాక కోసం ఎదురుచూపులు



ఎండ తీవ్రతకు ముమ్మిడివరంలో నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

ముమ్మిడివరం: ప్రచండ భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. రోహిణి కార్తె ప్రారంభం నుంచి నిత్యం మండుతున్న ఎండలతో వాతావరణం నిప్పుల కొలిమిగా మారింది. ఉదయం 8 గంటల నుంచే సూరీడు నిప్పులు చెరుగుతుండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. గత నాలుగు రోజులుగా అమలాపురం, ముమ్మిడివరం పరిసర ప్రాంతాల్లో 40 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఉదయం 10 గంటలు దాటిందంటే జన సంచారం లేక రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. దుకాణాలు, షాపులు మూసేసి వ్యాపారులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. గత కొద్దిరోజులుగా ముమ్మిడివరం, యానాం, తాళ్లరేవు, మురమళ్లలో మధ్యాహ్నం వేళ కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తుంది. సాయంత్రం 6 గంటలు దాటినా వేడిగాలులు తగ్గకపోవడంతో ప్రజలు ఉక్కబోతతో నరకయాతన అనుభవిస్తున్నారు.

వర్షాల కోసం ఎదురుచూపులు

ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రజలు ఉదయం నుంచే ఏసీలను, కూలర్లను ఆశ్రయిస్తుండడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితులలో వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, గొడుగు, ముఖానికి మాస్క్ ధరించి వెళ్లాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు సూర్య ప్రతాపానికి గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం కనిపిస్తుంది. మోటారు సైకిల్‌పై వెళ్లే ప్రయాణికులు టోపీలు, ముఖానికి జేబు రుమాళ్లు కట్టుకుని ప్రయాణిస్తున్నారు. బాటసారులైతే నెత్తిన రుమాలు, మహిళలు చీర కొంగులు కప్పుకొని ప్రయాణం సాగిస్తున్నారు. సాధారణంగా జూన్ ప్రారంభంలో నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం చల్లబడుతుంది. అయితే ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో జూన్ రెండో వారంలోకి అడుగుపెట్టినా ఇంకా భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజలంతా వరుణ కటాక్షం కోసం ఎదురుచూస్తున్నారు.

శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ

సూర్య ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో కొబ్బరి బొండాలతో పాటు శీతల పానీయాల దుకాణాలు, జ్యూస్ సెంటర్లలో హడావిడిగా నెలకొంటుంది. పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన చలివేంద్రాల ద్వారా చల్లటి మజ్జిగను సరఫరా చేస్తుండడంతో పాదచారులు, వాహనదారులు వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు.



వేసవి తాపాన్ని తట్టుకోలేక పళ్ల రసాలు సేవించి సేద తీరుతున్న బాటసారులు



ముసుగు ధరించి ప్రయాణిస్తున్న మహిళ



ముఖానికి జేబు రుమాలు కట్టుకుని ప్రయాణిస్తున్న యువకుడు

రూ.28 లక్షలతో కోనేరు ఆధునీకరణ పనులు



వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న కోనేరు ఆధునీకరణ పనులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో రూ.28 లక్షలతో చేపట్టిన ఆధునీకరణ పనులు ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ధర్మకర్తల ఆధ్వర్యంలో బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్ల కిందట అప్పటి ధర్మకర్తల మండలి ఈ కోనేరును దాదాపు రూ.20 లక్షలతో ఆధునీకరించినా నాణ్యత లోపాల కారణంగా కాంక్రీట్ పనుల్లో డొల్లతనం బయటపడి శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఏడాది మార్చి నెలలో జరిగిన స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన తెప్పోత్సవం సందర్భంగా కోనేరులోని నీటిని మార్చే ప్రయత్నంలో గట్లు బలహీన పడి కూలిపోయాయి. దీంతో ప్రస్తుత ధర్మకర్తల మండలి భక్తుల సౌకర్యార్థం కోనేరు అడుగు భాగంలో కాంక్రీటును, గట్లను పటిష్టంగా నిర్మించేందుకు ఆధునీకణ పనులు చేపట్టారు. పనులు మొదలయ్యాయి.

సీఎస్‌ఆర్ నిధులతో కమ్యూనిటీ భవనాల అభివృద్ధి

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



నీలపల్లిలో సామాజిక భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ఓఎన్‌జీసీ సీఎస్‌ఆర్ నిధులతో మండలంలోని కమ్యూనిటీ భవనాలను అభివృద్ధి చేయనున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లరేవులో ఉన్న అంబేడ్కర్ భవన్‌పై రూ.36 లక్షల వ్యయంతో వేయనున్న పైఅంతస్తు భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసారు. బౌద్ధ ఉపాసకులు ఎడ్ల కుటుంబరావు బౌద్ధ సాంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యే పొన్నాడతో పూజలు చేయించారు. అదేవిధంగా నీలపల్లి గ్రామ పంచాయతీలో గత 12 ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన సామాజిక భవనం ఆధునీకరణకు సీఎస్‌ఆర్ నిధులు రూ.25 లక్షలు కేటాయించగా ఆ పనులకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, దున్నా జనార్దనరావు, కొపనాతి నాగరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, సర్పంచ్‌లు రెడ్డి అరుణ సుహాసినీదేవి, చిట్టూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న రామారావు, వెంకటేశ్వరరావు

అల్లవరం: వ్యవసాయానికి తీవ్ర ప్రతిబంధకంగా మారిన ముంపు, ఉప్పు జలాలపై పరిశోధన జరగాల్సి ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యులు జున్నూరి రామారావు కోరారు. మల్కిపురం మండలం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జున్నూరి రామారావు, ఉద్యాన శాఖ జిల్లా డైరెక్టర్ జున్నూరి వెంకటేశ్వరరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో ముంపు ప్రభావం వరి సాగుకు తీవ్ర ప్రతిబంధకంగా మారిందని, అలాగే ఉప్పు జలాలు వ్యవసాయ క్షేత్రాల్లోకి చేరి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని చెప్పారు. ముంపు నివారణ, ఉప్పు జలాలుపై పరిశోధన చేసేందుకు జిల్లాలో వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రిని కోరారు. అమలాపురం, ఉప్పగుప్తం, అల్లవరం మండలాల్లోని ప్రధాన డ్రెయిన్లు కూనవరం, వాసాలతిప్ప, శంకరగుప్తం ముంపునీరు దిగే జీరో స్థానం నుంచి డ్రెయిన్‌లను ఆధునీకరించాలని విన్నవించారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని డ్రెయిన్ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారని రామారావు తెలిపారు.

కొత్త పీహెచ్‌సీ నీలపల్లికి కేటాయించాలి



ఎమ్మెల్యే పొన్నాడకు వినతిపత్రం అందజేస్తున్న నీలపల్లి సర్పంచ్ నాగమణి

తాళ్లరేవు: మండలానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జూనియర్ కళాశాలలను నీలపల్లి గ్రామ పంచాయతీకి కేటాయించాలని సర్పంచ్ చిట్టూరి నాగమణి, స్థానిక నాయకులు కోరారు. బుధవారం స్థానిక అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పొన్నాడను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. నీలపల్లి, జార్జిపేట గ్రామ ప్రజలు విద్య, వైద్యం కోసం తాళ్లరేవు లేదా కాకినాడ వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వాటిని నీలపల్లి గ్రామ పంచాయతీకి కేటాయించాలని, వాటి ఏర్పాటుకు స్థలం కూడా సమకూర్చనున్నట్లు సర్పంచ్ నాగమణి తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో స్థానిక నాయకులు రెడ్డి సతీష్, రేవు మల్లీశ్వరి, చిట్టూరి కలికిమూర్తి, మోకా మధుబాబు, కట్టా దుర్గారావు, బత్తుల అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న భక్తులు

ముమ్మిడివరం: నగర పంచాయతీ శివారు క్రాపచింతలపూడిలో సుమారు రూ.కోటితో పునర్నిర్మించనున్న ఉమా వల్లభేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు బుధవారం భూమి పూజ చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయ శాఖ రూ.40 లక్షలు నిధులు కేటాయించగా ముమ్మిడివరానికి చెందిన వైద్యుడు నేమాని జగన్మోహనరావు రూ.14 లక్షలతో పాటు గ్రామస్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మత్స చిట్టిరాజు, జనసేన నాయకుడు పితాని బాలకృష్ణ, చింతలపూడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరసిద్ధి వినాయకుని ప్రతిష్ఠ



వరసిద్ధి వినాయకుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: స్థానిక జీఎస్‌నాయుడు కాలనీలో నెలకొల్పిన వరసిద్ధి వినాయకుని విగ్రహ ప్రతిష్ఠోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మహాపూర్ణాహుతి, దృష్టి ధేనువు, దివ్యదర్శనం, ఆచార్య పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్వామిని దర్శించుకుని విశేష పూజలు జరిపారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో ఆయన పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో వరసిద్ధి వినాయక మందిర కమిటీ, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

కోతలయ్యాక మళ్లీ విరగకాసింది



గొల్లవిల్లిలో విరగ పండిన చేను

ఉప్పలగుప్తం: మండలంలో రైతులు సాధారణంగా ఏడాదికి ఖరీఫ్, రబీల్లో కలిపి రెండు పంటలు వేస్తారు. రబీ కోతల అనంతరం పొలాలను ఖాళీగా వదిలేస్తుంటారు. అయితే ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలోని ఓ రైతు పొలంలో రబీ కోతల అనంతరం మళ్లీ వరి పంట విరగకాయడం చూసి స్థానిక రైతులు ఆశ్చర్యపోతున్నారు. ఎటువంటి పెట్టుబడి, శ్రమ లేకుండా తన పొలంలో ఎకరానికి 5 బస్తాలకు పైగా దిగుబడి వచ్చేలా ఉందని రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. రబీ కోతల సమయంలో కురిసిన వర్షాల కారణంగానే దుబ్బుల నుంచి మరోసారి పంట పండి ఉంటుందని స్థానిక రైతులు చెబుతున్నారు. ఈ చిత్రం బుధవారం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

అంబాజీపేట: ముక్కామల ప్రధాన రహదారిలో బైక్ మహిళను ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ముక్కామల శివారు శ్రీరామపురానికి చెందిన రెడ్డి వెంకటలక్ష్మి ఈ నెల 6న తన ఇంటి ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డును దాటుతుంది. అదే సమయంలో కొత్తపేట నుంచి అమలాపురం వైపు వెళుతున్న మోటారుసైక్లిస్ట్ వెంకటలక్ష్మిని బలంగా ఢీకొట్టాడు. దాంతో స్థానికులు అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

'శివదేవ శతకం' పుస్తకావిష్కరణ



శివదేవ శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అమలాపురం టౌన్: బుర్ర కథ కళాకారుడు, రచయిత పండితారాధ్యుల సత్యనారాయణ రాసిన 'శివదేవ శతకం' పుస్తకాన్ని స్థానిక ఎర్రమిల్లివారి వీధిలోని ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ భవనంలో పలువురు సాహితీవేత్తలు, విద్యావేత్తలు బుధవారం ఆవిష్కరించారు. పుస్తకాన్ని సమీక్షించిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కేవీ ప్రభాకరశర్మ మాట్లాడుతూ శివ తత్వాన్ని బాగా గ్రహించిన పండితారాధ్యుల సత్యనారాయణ దానిని శతక రూపంలో మనకు అందించారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల సంస్కార భారతి శాఖల అధ్యక్షులు విశ్వ శ్రీనివాసశర్మ, ఆకొండి పవన్‌కుమార్, జిల్లా కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, వేదనభట్ల సాయిలక్ష్మి, శ్రీగిరి గోపాల కృష్ణ, పెమ్మరాజు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'వత్సవాయి' సేవలు అజరామరం



రాధామణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ ఉపాధ్యాయురాలిగా యూటీఎఫ్‌లో అనేక పదవులు చేపట్టిన వత్సవాయి రాధామణి (80) ఉపాధ్యాయ హక్కుల ఉద్యమంలో అలుపెరగకుండా అందించిన సేవలు అజరామరమని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లో అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన రాధామణికి స్థానిక ఎంప్లాయిస్ హోంలో బుధవారం మధ్యాహ్నం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాధామణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షురాలు పీఎస్ శిరోమణి, యూటీఎఫ్ జిల్లా నాయకులు కృష్ణంరాజు, టి.రామమూర్తి, రమణ, బేతిపూడి శ్రీనివాస్, విశ్వప్రసాద్, చంద్రకళ, బీఎస్ వెకంటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆకస్మిక మృతి

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కొపనాతి గోవరాజు(32) అనే మత్స్యకారుడు బుధవారం ఆకస్మికంగా మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గోవరాజు బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. కొద్దిసేపటికే కళ్లు తిరిగి పడిపోయాడు. స్థానికులు హుటాహుటీన తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే గోవరాజు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య ఆదిలక్ష్మి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.